క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్లకు మాస కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. మాస కల్యాణాన్ని తిలకించేందుకు వందలాది మంది భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన మాస కల్యాణం ప్రతి నెలా నిర్వహిస్తామని, ఆలయ అభివృద్ధి కోసం నిత్య గోత్రనామార్చన, లక్ష తులసి పూజ, హోమాలతోపాటు భక్తులకు అన్న సమారాధన వంటి కార్యక్రమాలు చేపట్టామని దీనికి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ధర్మవరంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొవ్వూరు: ధర్మవరంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రయ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ అండ్ చైర్మన్ కె.రూపలత ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యుల కంటి పరీక్షలు నిర్వహించారు.అవసరమైన వారికి ఆశ్రయ చారిట బుల్ ట్రస్టు తరపున శస్త్ర చికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. బోర్డు మెంబర్లు పి.ఇమ్మానియేల్‌రాజు, పి.స్వర్ణజ్యోతి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జలాది రవికుమార్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

నిడదవోలు : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో దళితులను సాంఘికంగా బహిష్కరించిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో చర్చిపేటలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు, చర్చిపేట యువత పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు : గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా శిశువులు జన్మిస్తారని ఐసీడీఎస్ సీడీపీవో ఎం.శ్రీలక్ష్మి అన్నారు. పట్టణంలోని టక్కర్‌బాబాపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ ముగింపు ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం.శ్రీలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, తల్లులు తీసుకునే ఆహారంలో వైవిధ్యత ఉండాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం వలన కలిగే లాభాలు వివరించారు. శిశువులకు సకాలంలో టీకాలు వేయించి, వైద్య పరీక్షలు చేయించాలన్నారు. మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ టీచర్ కె. హేమ మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మీ, పి. నళిని అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, పద్మ, జరీనా, మమత పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

తాళ్లపూడి: వేగేశ్వరపురం కార్యాలయం వద్ద మంగళవారం విపత్తులు వచ్చే సమయంలో వాటిని ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై ప్రజలు, ఉద్యోగులు ఏ విధంగా స్పందించాలనే అంశంపై ట్రైనర్ జోడాల వెంకటేశ్వరరావు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలామణి మాట్లాడుతూ మానవ తప్పిదం, ప్రకృతి వైపరీత్యాల వలన ఏర్పడే నష్టాలను ముందుస్తుగా అంచనా వేసి ప్రభుత్వం అందించే సూచనలు, నిబంధనలను పాటించాలని కోరారు. వరదలు, సునామీ, కోవిడ్ ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు జాగరూకత వహించాలని నివారణ చర్యల్లో పాల్గొనే సిబ్బందికి పూర్తిస్థాయిలో సహాయం, సహకారం అందిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎంఈవో సీహెచ్ బాలామణి, పంచాయతీ కార్యదర్శి నాగాంజనేయులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడిన ఇసుక ర్యాంపులు

- ఇసుక లభ్యత లేక ఇక్కట్లు
- నిర్మాణ రంగంపై ప్రభావం
- రంగంలోకి దిగిన దళారులు
- అధిక ధర వసూలు
- నిడదవోలు నియోజకవర్గంలో 5 రీచ్‌లకు 4 చోట్ల మూసివేత
- వరి మాసూళ్ల కోసం ర్యాంపుల మూసివేత



తీపర్రు ఇసుక ర్యాంపులో ఖాళీగా ఉన్న పొక్లెయినర్లు



తీపర్రులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక



కానూరులో అధికార పార్టీ నేత అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

పెరవలి: ఉచిత ఇసుక విధానం అధికార పార్టీ నేతలకు కాసులు కురిస్తుండగా దళారులు మాత్రం ఇసుకను నిల్వ చేసుకుని అధిక ధరలకు అమ్ముకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో 5 ఇసుక ర్యాంపులుండగా కేవలం ఒక చోట మాత్రమే ఇసుక తవ్వకాలు జరపటంతో ఇసుక లభ్యత లేక వినియోగదారులు విలవిలలాడిపోతున్నారు.

కాసుల వేటలో దళారీలు.. మామూళ్ల మత్తులో అధికారులు

తీపర్రు ఇసుక ర్యాంపు ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు మూసివేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడ ట్రాక్టర్లు వస్తే, కూలీలు రారు, కూలీలు వస్తే ట్రాక్టర్లు రాకపోవటంతో నెలలో 15 నుంచి 20 రోజులు మూసివేస్తున్నారు దీనితో వాహనదారులు ఇక్కడకు రావటానికి సాహసించటం లేదు. నిడదవోలు నియోజకవర్గంలో 5 ఓపెన్ రీచ్‌లకు 15 రోజులుగా 4 మూతపడటంతో వినియోగదారులు, ఇసుకపై ఆధారపడిన కూలీలు అల్లాడిపోతున్నారు. ఇసుక ర్యాంపుల్లోని అవినీతిని అడ్డుకోవటంలో అధికారులు వెనుకపడ్డా, దళారీలు మాత్రం కాసులు దండుకోవడంలో ముందున్నారని చెప్పవచ్చు. కాంట్రాక్టర్లు నిబంధనలను తుంగలో తొక్కి భారీ యంత్రాలతో ఇసుక లోడ్ చేయటం, అధిక వసూళ్లకు పాల్పడటం వంటివి కొనసాగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నియోజకవర్గంలో వరి మాసూళ్ల మూలంగా ఇసుక ర్యాంపులు మూతపడ్డాయి. ఇదే సమయంలో దళారీలు నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను అధిక ధరలకు విక్రయించి సొమ్ములు దండుకుంటున్నారు.

నియోజకవర్గంలో ఎన్ని రీచ్‌లు

నిడదవోలు నియోజకవర్గంలో జీడిగుంట, పందరపర్రు, కానూరు–పెండ్యాల, తీపర్రు, కాకరపర్రు రీచ్‌లు ఉండగా వీటిలో కాకరపర్రు ఇసుక ర్యాంపు తప్ప మిగిలిన 4 ర్యాంపులు మూసి ఉన్నాయి. ఈ పందలపర్రు రీచ్‌లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణలు రావడంతో గతంలోనే ఆ రీచ్‌ను మూసివేసారు. కానూరు–పెండ్యాల, పందలపర్రు రీచ్‌లలో కాంట్రాక్టర్లు కూటమి నాయకుల ప్రోద్బలంతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తూ, అక్రమంగా అధిక ధరలు వసూలు చేయడంతో కలెక్టర్ స్వయంగా పరిశీలించి అక్రమాలు గుర్తించి అక్కడ ఇసుక తవ్వకాలను నిలుపుదల చేశారు. ఆ తరువాత తమకున్న రాజకీయ అండతో పందలపర్రు, కానూరు –పెండ్యాల ఇసుక ర్యాంపులు యథేచ్ఛగా నడిపారు. ఈ ర్యాంపుల్లో ఎన్ని అక్రమాలు జరిగినా అధికారులు మాత్రం ఇటువైపు కన్నెతి చూడలేదు.

ఇసుక లేక ఇక్కట్లు

గోదావరి తీర ప్రాంత ప్రజలకు రీచ్‌లు ఉండి ఇసుక లభ్యం కాకపోవటంతో గృహనిర్మాణాలు చేపట్టిన వారు ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకరపర్రు ర్యాంపులో ఇసుక లభ్యత ఉన్నా ఉదయం వెళితే సాయంత్రానికి రావటానికి వీలు ఉండటం లేదని వాహనదారులు చెబుతున్నారు. ఇసుక కావాలంటే కోనసీమ జిల్లా గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెళ్లి తెచ్చుకోవలసి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నుంచి ఇసుక తెచ్చుకుంటే వేలల్లో ఖర్చు అవుతుందని దీని పర్యవసానంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని వారంటున్నారు. ఇసుకపై ఆధారపడిన తాపీ మేస్త్రిలు, కూలీలు, శ్లాబ్ నిర్మాణ, సెంట్రింగ్ కూలీలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇసుక లభించడం లేదు



ఇసుక కోసం రాంపుల వద్దకు వెళ్లితే మూసి ఉన్నాయి. ఇసుక ఎక్కడా లభ్యం కావడం లేదు. గోపాలపురం వెళ్లి ఇసుక తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భవన నిర్మాణ కార్మికులకు పనులు ఉండటం లేదు.

– అల్లంరాజు, ట్రాక్టర్ డ్రైవర్, పెరవలి

ర్యాంపుల వద్ద అధిక ధర వసూలు



ఇసుక దొరక్క ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఉచిత ఇసుక అంటే ఇళ్ల నిర్మా ణాలు చేపట్టవచ్చని ఎంతో ఆశించాం. ఇసుక కోసం ర్యాంపుల వద్దకు వెళితే దళారులు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఉచిత ఇసుక పథకం అమలు కావటం లేదు.

– బోకే వెంకటేశ్వర్లు, ఖండవల్లి

సేంద్రియ వ్యవసాయంతో భూసారం పెరుగుదల



ముత్యాలవారిపాలెంలో నవధాన్యాల కిట్‌ను రైతులకు అందజేస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్

పెరవలి: భూసారం పెంచటం కోసమే కాకుండా భావితరాల భవిష్యత్తు కోసం సేంద్రియ వ్యవసాయం చేయాలని సేంద్రియ వ్యవసాయం జిల్లా కో ఆర్డినేటర్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని ముత్యాలవారిపాలెంలో రైతులతో మంగళవారం ర్యాలీ నిర్వహించి, రైతులకు నవధాన్యాల కిట్‌లను అందించి ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం 45 వేల ఎకరాలకు చేరిందని, ఇది మరింత పెరగాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులపై రైతులు, ప్రజలకు అవగాహన కలిగించాలిన ఆయన తెలిపారు. రసాయినిక ఎరువులు వలన పంట భూములు సారం కోల్పోతాయని, సేంద్రియ వ్యవసాయంతో నేలలు సారవంతమవుతాయని వివరించారు. దీని వలన ప్రతి ఎకరానికి 2 టన్నులు ఎరువు తయారుకావడమే కాకుండా, నేల గుల్లబారి మరో పంటకు ఉపయోగపడుతుందన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగుకి మండలంలో ఖండవల్లి, ముక్కామల, కాపవరం, మల్లేశ్వరం, పెరవలి గ్రామాలను ఎంపిక చేసి చిరు ధాన్యాల విత్తనాలను అందిస్తున్నామన్నారు. చిరు ధాన్యాల పంటల కోసం 30 రకాల విత్తనాలు సిద్ధం చేసామని, వీటిలో ఏ పంట వేసినా చేనుకు బలం– రైతుకు లాభం వస్తుందన్నారు. ఈ సందర్భంగా రైతులు వెంకట కృష్ణారావు, వెంకటపతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ ఉమా మహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి సూర్యానారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటకృష్ణ, భవాని, జ్యోతి, ప్రశాంతి, వెంకటరమణ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే భూ సంరక్షణ సాధ్యం



వేములూరులో ఉత్తమ రైతులకు సత్కారం



ధర్మవరంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు: ప్రతి రైతు నవధాన్యాల సాగు ద్వారా భూసారాన్ని సంరక్షించుకోవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి ఎ.గంగాధరరావు సూచించారు. వేములూరు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం పచ్చిరొట్ట ఎరువుల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నవ ధాన్యాల పంటను పశుగ్రాసంగా వాడుకోవచ్చునని, భూమి కలియదున్నడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని సూచించారు. పచ్చి రొట్ట పంటగా నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు.ప్రతి రైతు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు. సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, ఉద్యానశాఖాధికారి శ్రీనివాస్, వీహెచ్ఏ ఆనంద్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

తాళ్లపూడి: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధ్యమవుతుందని, రైతులంతా ప్రకృతి వ్యవసాయం చెయ్యాలని సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు కోరారు. వేగేశ్వరపురంలో మంగళవారం వేసవిలో నవధాన్యాల సాగుపై ప్రజలకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగుతో నేలకు 30 రకాలు పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆర్థిక పరిపుష్టి

కొవ్వూరు: సార్వా, దాళ్వా వరి పంట తర్వాత మూడో పంటగా రాగి, కొర్రలు వంటి చిరు ధాన్యాలు సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చునని ఏరువాక కేంద్రం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు సూచించారు. ధర్మవరంలో రైతు సేవా కేంద్రంలో మంగళవారం చిరుధాన్యాల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుకి పెట్టుబడి వ్యయం, చీడపీడల తాకిడి తక్కువగా ఉంటాయన్నారు. ఎకరా వరికి కావాల్సిన నీటితో ఐదెకరాల చోడి పంట సాగు చేయవచ్చునన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ ఎ.జయరామలక్ష్మి మాట్లాడుతూ కేవలం 70 నుంచి 85 రోజుల వ్యవధిలో వేసవిలో పంట చేతికి అందుతుందన్నారు.ఎకరాకి నికరాదాయం రూ.20వేలు వస్తుందన్నారు. గ్రామంలో చిరు ధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.మండల వ్యవసాయ శాఖాధి కారి ఎ.గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



యర్నగూడెంలో కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి

దేవరపల్లి: పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ యువతీ, యువకులు కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత కంప్యూటర్, మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్న పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థను ఆయన అభినందించారు. ప్రభుత్వం ద్వారా మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం కుట్టుమెషీన్లు అందజేస్తామని ఆయన తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 60 మంది మహిళలకు సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు విడతలుగా 60 మందికి ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. నల్లజర్లలో శిక్షణా కేంద్రం ప్రారంభించి 60 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి బ్యాచ్‌కి 3 నెలలు చొప్పున శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామని ఆయన వివరించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు వేసవి సెలవుల్లో ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సురేంద్రకుమార్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బ్యాంకు ద్వారా ముద్ర రుణాలు అందజేస్తామని ఆయన తెలిపారు. అవసరమైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. కుట్టు శిక్షణ కేంద్రం, కంప్యూటర్ శిక్షణ కేంద్రం గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డి.అచ్యుతరావు, డి.రవీంద్ర, సోమిశెట్టి వెంకట్రావు, శీమకుర్తి కృష్ణ ప్రసాద్, బాబూరావు, ట్రైనర్ దుర్గాభవాని, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నేడు ఆర్డీవోకు వినతిపత్రం

కొవ్వూరు: ధాన్యం కొనుగోలు అంశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేయనున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

చాగల్లు: ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు.ఉపాధి హామీ పనులు కావలసిన వారు ఆయా గ్రామాల్లో స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని ఎంపీడీవో అన్నారు. పలు గ్రామాల్లో పంట బోదెల్లో పూడిక తీత పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. మంగళవారం సుమారు వెయ్యి మంది కూలీలు పనులకు వచ్చారని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.11వేల జరిమానా

కొవ్వూరు: తమిళనాడులో కుడ్డలోర్ జిల్లా వన్నరపాలయమ్‌కి చెందిన రామచంద్రన్ దేవానంత్ అనే వ్యక్తి మద్యం సేవించి కారు నడుపుతూ పట్టణ పోలీసులకు పట్టుబడ్డారు. నిందుతుడ్ని కొవ్వూరు సెకండ్ అడిషనల్ అండ్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా న్యాయమూర్తి నిందితుడికి రూ.11వేలు జరిమానా విధించినట్లు సీఐ పి.విశ్వం తెలిపారు. దేవానంత్ మద్యం సేవించి కారు వేగంగా నడుపుకుంటూ రావడంతో అడ్డుకుని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యం



ప్రభుత్వాసుపత్రిలో మంటలు ఆర్పే విధానాన్ని వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నిడదవోలు : అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక శాఖాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరక్కుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయక అగ్నిమాపకశాఖాధికారి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో డెమో ద్వారా ప్రత్యక్షంగా ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్, ఫయాజ్ వైద్యులు, అగ్నిమాపక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రకళ పోటీలో విద్యార్థుల ప్రతిభ



సత్యవాడ ఉన్నత పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: చిత్రకళ పోటీలో మండలంలోని సత్యవాడ ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభచూపి పలు పతకాలు సాధించినట్లు హెచ్ఎం బి.సూర్యకాంతం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం సత్యవాడ ఉన్నత పాఠశాలలో పతకాలు పొందిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా డ్రాయింగ్ ఉపాధ్యాయుడు బి.పోతురాజు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో నిర్వహించిన అఖిల భారత యువజన, బాలల చిత్రకళ పోటీల్లో పాఠశాల విద్యార్థులు జి.రవీంద్ర మంగస్వామి, కె.భవ్యశ్రీ, ఆర్.అమృత పాల్గొని బంగారు పతకాలు సాధించగా, వై.ఆశ్లేష లక్ష్మీ, పి.ప్రశాంత లక్ష్మీ, బి.అక్షిత, జె.సాత్విక్, కె.విజయ సాయి లక్ష్మీ వెండి పతకాలు సాధించారన్నారు. పాల్గొన్న మిగిలిన విద్యార్థులు ప్రశంసాపత్రాలు పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను, ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

అమ్మ ఒడి ఎప్పుడిస్తారు..?

జీడిగింజల కార్మికుల ప్రశ్నతో కంగుతిన్న ఉపాధ్యాయులు



నబీపేటలో విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకున్న ఎంఈఓలు

నల్లజర్ల: బడి బాట అంటూ విద్యా శాఖ చేపట్టిన కార్యక్రమం ఉపాధ్యాయులను ఇరకాటంలో పెడుతోంది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిస్తే.. విద్యా సంక్షేమ పథకాలు ఎప్పుడొస్తాయంటూ ప్రశ్నలు కురిపిస్తున్నారు. ఇలాంటి సంఘటనే నల్లజర్లలో బడిబాటకు వెళ్లిన ఉపాధ్యాయ బృందానికి ఎదురుకావడంతో.. వారంతా కంగుతిన్నారు. వివరాల్లోకి వెళితే.. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివించాలంటూ ఎంఈఓ–1 వై.సత్యనారాయణ, ఎంఈఓ భగవతి ఆధ్వర్యంలో బడిబాట రెండో రోజు కార్యక్రమాన్ని విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ చైర్మన్లు మంగళవారం నిర్వహించారున. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వం రాయితీలు అందిస్తుందంటూ వివరిస్తూ, తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని వారు కోరారు. ఈ క్రమంలోనే అమ్మ ఒడి ఎప్పుడు ఇస్తారంటూ జీడిగింజలు వలిచే కార్మికులు ఉపాధ్యాయులను ప్రశ్నించారు. దీంతో ఉపాధ్యాయ బృందం సమాధానం చెప్పలేక దాటవేశారు. దీంతో ఇదంతా ప్రచారం కోసమే చేస్తున్నారన్నట్టు స్థానికులు చర్చించుకున్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ




మేడే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

దేవరపల్లి: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన గౌరీపట్నంలో మంగళవారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పి.నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్ మాట్లాడుతూ, మేడే నాడు గౌరీపట్నం ప్రాంతంలోని క్రషర్ల ఆపరేటర్లందరూ విధులను బహిష్కరించి, వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న లేబర్ కోడ్ రద్దుకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గౌరీపట్నం, దుద్దుకూరు, కొండగూడెం, దేచర్ల, పంగిడి ప్రాంతాల్లోని క్వారీ, క్రషర్ల వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యాన మేడే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

బార్‌లో బీరు సీసాతో దాడి

- తీవ్ర గాయాలతో పోలీస్ స్టేషన్‌కువెళ్లిన బాధితుడు
- కేసు నమోదు



ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్న మహబూబ్ షరీఫ్

నిడదవోలు : స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని పాటిమీద సెంటర్‌లో నివాసముంటున్న మహమ్మద్ షరీఫ్ భీమవరంలో ప్రైవేట్ సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మంగళవారం మధ్యాహ్నం పట్టణానికి చెందిన ఓ యువతికి ఫోన్ చేసి తనతో మాట్లాడకపోతే యాసిడ్ పోస్తానంటూ బెదిరించడంతో ఆ యువతి భయపడి 112 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. ఇదే విషయాన్ని ఆ యువతి తన సోదరుడైన జ్ఞానేంద్ర దృష్టికి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో షరీఫ్‌కు జ్ఞానేంద్ర ఫోన్ చేసి, ఎక్కడున్నావంటూ ఆరా తీశాడు. బార్ అండ్ రెస్టారెంట్‌లో ఉన్నట్టు షరీఫ్ చెప్పడంతో యువతి సోదరుడు అక్కడికి వెళ్లాడు. అక్కడ వారిద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన జ్ఞానేంద్ర బార్‌లో ఉన్న బీర్ సీసాతో షరీఫ్‌పై దాడి చేశాడు. దాడిలో షరీఫ్ తీవ్రంగా గాయపడ్డారు. తల నుంచి తీవ్రంగా రక్తం కారుతున్నా లెక్క చేయకుండా దగ్గరలో ఉన్న పట్టణ పోలీస్ స్టేషన్‌కు షరీఫ్ వెళ్లాడు. పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు వెంటనే అతడిని తన సిబ్బందితో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ షరీఫ్ చికిత్సపొందుతున్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.